

వలపు తలపులు — చిత్రం — రావాడ కృష్ణ (ధవళేశ్వరం)

## స్కెచ్

# బ్రహ్మచారులకు ఒక సలహా

బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరాదంటారు పెద్దలు. నిర్మొహమాటంగా చెప్పాలంటే ఈ మాట పెళ్ళి చేసుకుని, సంసార సాగరంలోపడి ఈదులాడుతూ, దారీ తెన్నూ కానుపించక కొట్టు మిట్టాడుతూ, మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్నవారు అన్నదే కాని అన్యం కాదు.

ముదిరిన బ్రహ్మచారికన్న పరమ శత్రువు లేడు వివాహితులైన వృద్ధులకు. తాము కోల్పోయిన సుఖాన్ని, శాంతిని, అన్నిటినీ మించి స్వాతంత్ర్యాన్ని రెండు చేతులా జుర్రుకొంటున్నవారిని చూస్తే నిజంగానే ఎంతటివారికి అయినా కడుపు మండుతుంది.

కనుకనే వివాహ యోగ్యుడైనా కాకపోయినా బ్రహ్మచారి కనపడితే చాలు. "పెళ్ళి ఎప్పుడోయ్" అని పరామర్శిస్తారు. అంతటితో సంతృప్తి చెందరు. "మా ఎరికలో ఒక మంచి సంబంధం ఉంది. చక్కని చుక్క అనుకో. అంతే కాదు. నువ్వు కోరినంత కట్నం ఇస్తారు సుమా. నిమిషంలో ముహూర్తం పెట్టిస్తాను. అంతా సిద్ధమే" అని వలలో వేయడానికి యత్నిస్తారు పెద్దలైనవారు.

బ్రతకడం అనేది సమస్యగా పరిణమించిన ఈ చెడుకాలం ఇంకా దాపురించని మంచి కాలంలో—అంటే 'మా చిన్నతనం'లో —బ్రహ్మచారులు అయినవాళ్ళు పెళ్ళి అంటే ఇట్టే ఎగిరి గంతు వేసేవారు. వయసు ముదిరేకొలది, సంసార సుఖ దుఃఖాలు ఒంటబట్టే కొలది, తామూ అలాగే బ్రహ్మచారులు అయిన వాళ్ళమీద దండయాత్ర సాగించేవారు.

'మా చిన్నతనం' అని కావాలనే అన్నాను.

ఎవరికి అయినా మంచికాలం ఒక్కటే. అది వారి చిన్నతనం కాని చిన్నతనమే. అభమూ శుభమూ, కష్టమూ సుఖమూ తెలియని; తెలుసుకోలేని ఆ కాలంలో బాగానే గడిచిపోతుంది, మరి. అంత స్వల్పకు అంత విలువలేనిది ఆ కాలం. పైగా తనకు తానుగా, తనకు మాత్రమే పరిమితమైన అనుభూతిలోనే మనిషికి ఆనందం ఉన్నది. మరొకరి ప్రమేయం ఉన్నంత మేరకు ఆ ఆనందం కుంటు పడక తప్పదు.

కష్టమే అయినా, సుఖమే అయినా పూర్తిగా ఒకరితో పంచుకొనడం సాధ్యం కాదు. ఇది అనుభవైకవేద్యము.

ఒకరు ఇంకొకరి సుఖాన్ని ఆనందాన్ని చూచి, దానిని పంచుకుందామని అనుకోవచ్చు. దానిలో ఏదో ఉందని భ్రమపడవచ్చు. అలాంటి సుఖమూ, ఆనందమూ స్వకీయమైన అనుభవంలోనికి తెచ్చుకోవాలని కోరుకోవచ్చు.

అదిగో, సరిగా అలాంటి మన స్థితిలోనే ఆతడు సులభంగా ఇతరుల వలలో పడడం కద్దు. ఇది 'మా చిన్నతనం'నాటి మాట.

బ్రతకడం అనేది ఒక సమస్యగా, సమస్యలకే సమస్యగా పరిణమించిన ఈ కాలంలో బ్రహ్మచారులు అంతటి శోచనీయమైన స్థితిలో లేరు. వాస్తవిక పరిస్థితులు అవగాహనం చేసుకునేశక్తి, కఠోరమైన జీవనమే వారికి ప్రసాదించింది. అదే వారికి కవచంగానూ ఉంది.

మా రామ్‌చంద్‌ను "పెళ్ళి చేసుకో"మన్నాను ఒకసారి.

ఇది నాపట్ల ఎంతటి అవివేకమో నాకు ఆ సమయంలో తెలియదు.

"నేను పెళ్ళి చేసుకుంటే చచ్చిపోతావు నువ్వు" అన్నాడు మా రామ్‌చంద్.

నిజమే. వివాహితుడుగా బిడ్డల తండ్రిగా జీవితంతో నిత్య నిరంతరమైన సమరం సాగిస్తున్న నాకు ఆ కాలంలో మా రామ్‌చంద్ ఆపద్బాంధవుడు. దైవమే

స్నేహితుని క్షేమం కాంక్షించి, చిరునవ్వుతో, అడగకుండానే ప్రాణం అర్పించడానికి అణుమాత్రమైనా వెనుదీయని మిత్రులు సహితం ఈ కాలంలో అడిగినా ఒక నయాపైసా అప్పుగా ఇవ్వలేరు. ఇవ్వాలనే కోరిక లేకకాదు. ఇచ్చే శక్తి లేకనే.

అలాంటి ఈ పుణ్య కాలంలో అడిగినప్పుడల్లా అడిగినంతా అప్పు ఇవ్వగలిగిన, ఇచ్చే మా రామ్‌చందే కనుక నా మాట విని, పెళ్ళే కనుక చేసుకుంటే........ఆతడు కూడా నాలాగే డబ్బు అవసరం అధికంగా పెంచుకుని ఒకరిని చేయి చాచి అడగవలసిన స్థితిలో కనుక పడితే..... ఊహించడానికి కూడా భయంకరమైన పరిణామం సంభవించి ఉండేది కాదా?

అంతటి పొరపాటు చేసి చేతులారా వినాశాన్ని కోరి తెచ్చుకోబోయిన నన్ను మా రామ్‌చందే రక్షించాడు.

అనగా నా అదృష్టం బాగుండి, నా సలహా పాటించలేదు. పెళ్ళి చేసుకోలేదు.

ఇంతకూ బ్రహ్మచారులు అయినవారికి నేను చెప్పేది, చెప్పగలిగేది ఒక్కటే :

"పెళ్ళి చేసుకోకండేం!"

—తూలికాభూషణ్